

జువైనల్.. జస్టిస్!

8లో ▸

బాల నేరస్తులకు సంబంధించిన కేసులవిచారణ వేగవంతం చేయాలనే ఉద్దేశంతో మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో జువైనల్ కోర్టులు ఏర్పాటు చేశారు.



పట్టుగూళ్ల ఉత్పత్తిలో ఆదర్శంగా నిలవాలి

10లో ▸

పట్టుగూళ్ల ఉత్పత్తిలో రైతులు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ భారతి హోళ్లికేరి అన్నారు. పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కిష్టంపేటలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
32.4 /18.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు ఒకటి రెండు డిగ్రీలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండగా అనిపిస్తుంది. చలి ప్రభావం చాలా వరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రేషన్ దుకాణం తనిఖీ



రేషన్ దుకాణం తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

జన్నారం: మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ గురువారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. బియ్యం నిల్వ, పంచిన విధానాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పల్లె ప్రకృతి వనం, క్రీడా మైదానాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటకిషన్, ఆర్‌ఐ భానుచందర్ తదితరులు ఉన్నారు.

108 వాహనం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108, 102 వాహనాలను ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ గురువారం తనిఖీ చేశారు. సేవలు మెరుగుపర్చాలని సిబ్బందికి సూచించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఈఎంఈ కొండాల్, ఎఫ్‌సీ జనార్దన్, 108 , 102 సిబ్బంది ఉన్నారు.

పోలీస్ ఉద్యోగార్థులకు న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పోలీస్ నియామక ప్రక్రియలో ఏ రాష్ట్రంలో లేని నిబంధనలు తెలంగాణలో ప్రవేశపెట్టడంతో అనేకమంది అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హత సాధించలేకపోయారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఉద్యోగార్థులకు న్యాయం చేయాలని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల సంపత్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగ నియామకాల్లో చాలామందిని తొలగించేలా ప్రభుత్వం కుట్ర చేసిందని ఆరోపించారు. ఫిజికల్ టెస్ట్‌లో పాల్గొన్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రన్నింగ్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులందరికీ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమల్‌రావు, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు మహేశ్, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్, చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు సురేశ్, నాయకులు రత్నం ప్రదీప్, అజయ్‌గౌడ్, పవన్, ఠాకూర్ చింటు సింగ్, సన్నీ, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి ఖిల్లా రోడ్డు నిర్మాణం పూర్తి



ఖిల్లాకు వెళ్లే మార్గంలో పూర్తయిన రోడ్డు

రామకృష్ణాపూర్: తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన గాంధారి ఖిల్లాలో మరికొద్ది రోజుల్లో మైసమ్మ జాతర జరుగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. ఆదివాసీలు ఏటా నిర్వహించే జాతరలో భాగంగా గతేడాది నిర్వహించిన దర్బార్‌లో చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఖిల్లా అభివృద్ధితోపాటు జాతరకు వచ్చే భక్తుల కోసం మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.2.10 కోట్లు మంజూరు చేయించి బొక్కలగుట్ట గ్రామం నుంచి ఖిల్లా వరకు బీటీ రోడ్డు నిర్మించారు. గతంలో ఈ మార్గంలో కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా ఉండేది. పెద్ద సంఖ్యలో భక్తులు జాతరకు వస్తున్నా మట్టి రోడ్డు మీదుగానే రావాల్సి వచ్చేది. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఖిల్లా ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేయించారు. మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యేకు ఆదివాసీలు, గిరిజనులు, జాతరకు వచ్చే భక్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

కంటి పరీక్షలు షురూ!



చెన్నూర్‌లో కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన రామ్‌లాల్‌గిల్డా

- తొలిరోజు జిల్లాలో 5,466 మందికి పరీక్షలు
- అవసరమైన వారికి అద్దాలు పంపిణీ

తొలి రోజు కంటి వెలుగు వివరాలు

ఏర్పాటు చేసిన శిబిరాలు	40
కంటి పరీక్షలు	5,466
రీడింగ్ అద్దాల పంపిణీ	1,447
సిఫారసు చేసిన అద్దాలు(ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్)	868

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రెండో విడత కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కంటి పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన శిబిరాలకు వచ్చినవారికి వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, శిబిరాలను సందర్శించారు. మందమర్రి పట్టణంలో కలెక్టర్ భారతీ హోళ్లికేరి, మంచిర్యాల పట్టణం రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఎమ్మెల్యే దివాకర్ రావు, డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు శిబిరాలను ప్రారంభించారు. బెల్లంపల్లి పట్టణంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత కంటి వెలుగు శిబిరం ప్రారంభించారు. కోటపల్లి మండలం సర్వాయిపేట, వెంచపల్లిలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. తొలిరోజు 40 చోట్ల పరీక్షలు మొదలయ్యాయి. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ప్రారంభమైన శిబిరాల ఏర్పాట్లు, నిర్వహణ తీరును తెలుసుకునేందుకు కలెక్టర్ భారతి హోళ్లికేరి పలు శిబిరాలను సందర్శించారు. కంటి పరీక్షల కోసం వచ్చే వారి వివరాలు తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని సూచించారు.

అవసరమైన వారికి అద్దాలు

పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగానే అద్దాలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో దూర, దగ్గరి దృష్టిలోపాలతోపాటు రీడింగ్ గ్లాసెస్ అవసరమైన వారికి అందజేస్తున్నారు. పరీక్షల్లో కంటి శుక్లాల సమస్యలతో చూపు మందగించినట్లు గుర్తించినవారికి శస్త్ర చికిత్సకు సిఫారసు చేస్తున్నారు. వారికి ఈ కార్యక్రమంలో భాగంగానే ఆపరేషన్ చేయిస్తారు. అలాగే మెరుగైన చూపుకోసం కంటి అద్దాలు అందిస్తారు. జిల్లాలో 18 ఏళ్లు పైబడిన ఎవరికైనా ప్రభుత్వం ఉచితంగా ఈ పరీక్షలు నిర్వహిస్తుంది. స్థానికంగా ఏర్పాటు చేసిన శిబిరాలకు ఆధార్ కార్డుతో వెళితే అక్కడ వైద్య సిబ్బంది పరీక్షలు చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి...

నస్పూర్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు కోరారు. నస్పూర్ కాలనీ మనోరంజన్ సముదాయం, శ్రీరాంపూర్ కాలనీ సి7 క్వార్టర్, శ్రీరాంపూర్ సీఈఆర్ సింగరేణి క్లబ్‌లో కంటి వెలుగు క్యాంపులను ప్రారంభించారు. నస్పూర్ కాలనీలో మనోరంజన్ సముదాయంలో ఏర్పాటు చేసిన క్యాంపును జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడుతో కలిసి సందర్శించారు. మొదటి రోజు 420 మంది పరీక్షలు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ రమేశ్, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

రామకృష్ణాపూర్: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు తారకరామకాలనీలో అదనపు కలెక్టర్ రాహుల్ ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు ఒకటో వార్డులో శిబిరం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం అన్ని వార్డుల్లో కంటి శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని కంటి సమస్యలు పరిష్కరించుకోవా లని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటికి వెలుగు ఇచ్చేందుకే శిబిరాలు

- ఎమ్మెల్యే దివాకర్ రావు



కంటి పరీక్ష చేసుకుంటున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రజల కంటి సమస్యలు, నేత్ర సంబంధ వ్యాధులకు చికిత్స చేసి కంటికి వెలుగు ఇచ్చేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి కంటివెలుగు రెండో విడత కార్యక్రమం ప్రారంభించారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఉచితంగా పరీక్షలు చేసి సమస్యలు ఉన్నవారికి మందులు, అద్దాలు ఇస్తారన్నారు. అవసరాన్నిబట్టి శస్త్రచికిత్స చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కంటివెలుగు శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. జిల్లాలో 40 టీంలు సుమారు 9 లక్షల మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి అద్దాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రజలు తప్పనిసరిగా ప్రభుత్వం కల్పించిన సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపులో కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన రీడింగ్ గ్లాస్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు, వార్డు కౌన్సిలర్ బుద్దార్థి సత్తన్న, టీపీపీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, అత్తి సరోజ, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, బుద్దార్థి రాంచందర్, సీపతి శ్రీనివాస్, కంటి వెలుగు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఫయాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణం అంగడి బజార్ ఏరియాలోని పద్మశాలి భవన్‌లో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ భారతీ హోళ్లికేరి, ట్రైనీ కలెక్టర్ గౌతమితో కలిసి ప్రారంభించారు. నెల రోజులపాటు నిర్వహించే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒకటో వార్డు ప్రజలు సుమారు 270 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 137 మందికి అద్దాలు అందజేశామని వైద్యాధికారి శివప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు వైద్య సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కంటికి వెలుగునిస్తున్న ప్రభుత్వం

భీమారం: పేదప్రజలకు ఎలాంటి ఖర్చులేకుండా కళ్లకు వెలుగునిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ భారతీహోళ్లి కేరి తెలిపారు. భీమారం మండల కేంద్రంలో రెండోవిడత కంటివెలుగు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గ్రామీణులు దృష్టిలోపాన్ని పట్టించుకోవడం లేదన్నారు. దీనిని గమనించిన సీఎం కేసీఆర్ కంటివెలుగు ప్రవేశపెట్టారని తెలిపారు. దృష్టి లోపం ఉన్నవారు దీనిని వినియోగించుకోవాలని సూచించారు. భీమారంలో చికిత్సకోసం వచ్చిన పోతన్‌పల్లి గ్రామానికి చెందిన మహిళలతో మాట్లాడారు.

గడువులోగా లక్ష్యం పూర్తి చేయాలి

చెన్నూర్: మున్సిపాలిటీలో కంటి పరీక్షల కోసం ఆశ వర్కర్లు గుర్తించిన వారందరికీ పరీక్షలు నిర్వహించి, మున్సిపాలిటీకి నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ భారతి హోళ్లికేరి అన్నారు. స్థానిక బ్రాహ్మణ సేవాసంఘంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు. వార్డుల వారీగా గుర్తించిన వారి సంఖ్య పరీక్షల వివరాలను జిల్లా ఉప వైద్యాధికారి నీరజను అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు పరీక్షల కోసం వచ్చే వృద్ధులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుల పద్మశ్రీ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, వైద్య సిబ్బంది, మేప్మా సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ‘పరీక్షాపే చర్చ’

- విద్యాశాఖ ఆదేశాలు

మంచిర్యాలఅర్బన్: పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ధైర్యం నింపేందుకు కేంద్రం ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా పాఠశాలల్లో పరీక్షాపే చర్చ కార్యక్రమం నిర్వహించనుంది. విద్యార్థులకు ఒత్తిడిలేని వాతావరణాన్ని సృష్టించాలన్న లక్ష్యంతో కేంద్రం ఈనెల 27న పరీక్షాపే చర్చకు సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు పరీక్షా పే చర్చ కార్యక్రమం వీక్షించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. టీవీల ఏర్పాటుతో పాటు కరెంట్ సరఫరా నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు, జనరేటర్, ఇన్వర్టర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. అంతేకాకుండా సెల్‌ఫోన్‌లో ఫేస్‌బుక్, యూట్యూబ్, పీఎంవో వెబ్‌సైట్ ద్వారా కార్యక్రమం విద్యార్థులు వీక్షించే అవకాశం ఉంది. రేడియో చానల్ ఎఫ్‌ఎంలో కూడా వినొచ్చని విద్యాశాఖ పేర్కొంది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పరీక్షాపే చర్చ కార్యక్రమం వీక్షించవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో ఒత్తిడి, భయం పోయేలా సలహాలు ఇవ్వనున్నారు. విద్యార్థులతోపాటు టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ప్రధాని దిశానిర్దేశం చేయనున్నారు. పిల్లల లక్ష్యాలు, ప్రతిభ తెలుసుకుని ప్రోత్సహించేలా స్ఫూర్తినివ్వనున్నారు.

ఏర్పాట్లు చేసుకోవాలి

పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షాపే చర్చ కార్యక్రమం వీక్షించడం, వినడం కోసం తప్పనిసరిగా ఏర్పాట్లు చేసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. మైగౌట్ ప్లాట్‌ఫాంలో పిల్లలు చూస్తున్న వీడియో.. రేడియో ద్వారా వింటున్న ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నా.. ప్రత్యక్ష ప్రసారానికి అంతరాయం లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని అన్ని పాఠశాలల యాజమాన్యాల హెడ్‌లకు సూచించారు.

28న జిల్లాకు అమిత్‌షా రాక



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్

మంచిర్యాలటౌన్: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ నెల 28, 29న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తారని జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడానికి, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యటించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, జోడేఘాట్, ఆదిలాబాద్‌లో అమిత్‌షా పర్యటన ఉందని వివరించారు. 28న మంచిర్యాల పట్టణంలో పెద్దపల్లి పార్లమెంట్ బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పానుగంటి రంగారావు, పెద్దపల్లి పురుషోత్తం, రజనీష్ జైన్, మునీంద రమేశ్, ఆరుముళ్ల పోశం, వెంకటేశ్వర్ గౌడ్, కొయ్యల ఏమాజీ, జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.

అంజన్న భూములు హాంఫట్..!

- ఆలస్యంగా వెలుగులోకి
- ఇంటినంబర్లు ఇచ్చిన బల్దియా
- స్వాధీనానికి దేవాదాయ శాఖ అధికారుల చర్యలు



ఆంజనేయస్వామి గుట్టపై కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు, స్థానికులు(ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో దేవాదాయ శాఖకు చెందిన భూములు పరాధీనమయ్యాయి. ఏళ్ల క్రితమే అన్యాక్రాంతం కాగా, ఆలస్యంగా గుర్తించిన దేవాదాయ శాఖ అధికారులు ఆ భూములు స్వాధీనం చేయాలని పట్టుబడుతుండటంతో దేవాలయ భూములు సమస్యాత్మకంగా మారాయి. పక్కా గృహాలు నిర్మించుకున్నవారిలో ఆందోళన మొదలైంది. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న సంజీవని గుట్టపై ఆంజనేయ స్వామి దేవాలయం ఉంది. ఆ గుట్టను అనుకుని దేవాదాయ శాఖకు కన్నాల శివారు సర్వే నంబర్ 12/6లో 3.0020 ఎకరాలు, సర్వే నంబర్ 424/1లో 0.0840 గుంటలు, సర్వే నంబర్ 170/5/2లో ఎకరం భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఆయా సర్వే నంబర్లలోని భూమిలో కొంతమొత్తం కొన్నాళ్ల క్రితమే పరాధీనమైంది. దేవాదాయ శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సహాయ కమిషనర్ ఆంజనేయ స్వామి భూములు ఆక్రమణకు గురైనట్లు గతనెలలో బహిర్గతం చేయడంతో దశాబ్దాల నుంచి రహస్యంగా ఉంటూ వచ్చిన ఆంజనేయస్వామి భూముల విషయం ఆలస్యంగా వెలుగు చూసింది.

ఆక్రమిత భూముల్లో శాశ్వత కట్టడాలు..

ఆక్రమణకు గురైన ఆంజనేయస్వామి ఆలయ భూముల్లో కొందరు శాశ్వత నిర్మాణాలు చేశారు. ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఆ భూముల్లో ఇటీవల మరి కొన్ని నిర్మాణాలు చేపట్టారు. ఆ భూముల్లో కట్టుకున్న స్థిర నివాసాలకు మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు కూడా కేటాయించడం గమనార్హం. ఆ ఇళ్లన్నీ కొన్నాళ్ల క్రితమే నిర్మాణం చేసినట్లుగా మున్సిపల్ రికార్డుల్లో నమోదై ఉంది. 2001 నుంచి 2010 సంవత్సరం వరకు కట్టుకున్న ఇళ్లకు దశలవారీగా మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. పక్కా గృహాలు కట్టుకున్న వ్యక్తుల పేర్లను సైతం దేవాదాయ శాఖ అధికారులు ప్రకటించి ఆ ఇంటి నంబర్లు రద్దు చేయాలని మున్సిపల్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

విలువైన భూమి

బెల్లంపల్లిలో భూములకు డిమాండ్ ఉంది. మారుమూలలో ఉన్న భూమి కూడా ఎకరం అరకోటి పలుకుతోంది. ఇక రైల్వే స్టేషన్ ఎదుటే ఉన్న భూమి ధర ఎంతుందో ఊహించుకోవచ్చు. కోట్ల విలువైన ఆంజనేయస్వామి ఆలయ భూమి అన్యాక్రాంతం కావడంతో దేవాదాయ శాఖ అధికారులు భూముల స్వాధీనం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఆక్రమిత భూములను దేవాదాయ శాఖ అధికారులు సందర్శించి, సర్వేయర్‌ను తీసుకువచ్చి గతంలోనే హద్దులు ఏర్పాటు చేశారు. కబ్జాకు అయిన భూమి స్వాధీనం చేసుకునేందుకు శాశ్వత నిర్మాణాలు చేసిన వ్యక్తులను ఇళ్ల నుంచి ఎలా ఖాళీ చేయిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

కొన్నేళ్ల క్రితమే ఇంటి నంబర్లు..

మున్సిపాలిటీ 2001 నుంచి 2010 వరకు ఇంటి నంబర్లు కేటాయించింది. ఆంజనేయ స్వామి ఆలయ భూముల్లో నిర్మాణాలకు కొన్నాళ్ల క్రితమే నంబర్లు కేటాయించినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. దేవాదాయ శాఖ అధికారులు అందజేసిన ఫిర్యాదు మేరకు ఇళ్లు కట్టుకున్న వ్యక్తులకు నోటీసులు ఇస్తాం. ఉన్నతాధికారులకు నివేదించి నిర్ణయం తీసుకుంటాం.

– ఆకుల వెంకటేశ్,
మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా శ్రమించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

బెల్లంపల్లిరూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యార్థులు శ్రమించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. డీఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమంగా రాణించేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధి కాసిరెడ్డిపల్లెలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు – మన బడి కార్యక్రమంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈవో వెంట ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

మన ఊరు – మన బడి పనులు పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ, గ్రామీణప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు – మన బడి పనులను డీఈవో వెంకటేశ్వర్లు పరిశీలించారు. షంషీర్‌నగర్‌లోని మండల పరిషత్ పాఠశాలకు వెళ్లిన డీఈవో విద్యాబోధనను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి శ్రద్ధగా చదవాలని సూచించారు. అక్కడి నుంచి మన ఊరు – మన బడి కింద ఎంపిక చేసిన పాఠశాలలకు వెళ్లి పనులను పర్యవేక్షించారు. పనులు నాణ్యతగా చేపట్టడంతోపాటు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

26 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: భారత్ జోడో యాత్రకు మద్దతుగా ఈ నెల 26 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభిస్తున్నట్లు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, ఉట్నూర్ జెడ్పీటీసీ, మహిళా కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు చారులత తెలిపారు. జన్నారంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా హాత్‌సే హాత్ జోడో యాత్రను నేతలు ప్రారంభిస్తారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులను ఐక్యం చేసి ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఈ యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో జన్నారం మండలం రాంపూర్ నుంచి ఈ యాత్ర ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రతీ కార్యకర్త హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం రేండ్లగూడ గ్రామానికి చెందిన మల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, ఉపాధ్యక్షుడు మహేశ్, నాయకులు నందునాయక్, పద్మరావు, మాణిక్యం, ధర్మునాయక్, చంద్రయ్య, తిరుపతి, ఇమ్రాన్, లక్ష్మి, సోహెల్, హేమంత్‌చారి, ముజ్జు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పోర్ట్స్ అథారిటీలో చేరికలు

మంచిర్యాలటౌన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్, లాల్‌బహదూర్ స్టేడియంలో వివిధ క్రీడల్లో శిక్షణ నిమిత్తం చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. 12 నుంచి 18 ఏళ్ల వయస్సు గల వారిలో బాలికలకు అర్చరిలో, అథ్లెటిక్స్‌లో బాలురు, బాలికలు నాన్ రెసిడెన్షియల్, హాకీ బాలికలు, బాలురు రెసిడెన్షియల్, కబడ్డీ బాలురు రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, జిమ్నాస్టిక్స్ బాలికలు, బాలురు నాన్ రెసిడెన్షియల్‌లో ఉంటూ శిక్షణ పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ఓఎస్‌డీ టీఎస్ఎస్ఏ, హకీంపేట్‌లో సంప్రదించాలని తెలిపారు.

హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. 51 రోజుల హుండిలో రూ.53,24,420 నగదు, 102 గ్రాముల మిశ్రమ బంగారం, 4.060 కిలోల వెండి, 18 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన, స్టేట్‌బ్యాంక్ సిబ్బంది, ఎస్సై, వాగ్దేవి సొసైటీ సభ్యులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్‌చేసిన ఆటో

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని డాడానగర్ బస్టాండ్ సమీపంలో గురువారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం... బెల్లంపల్లి, మందమర్రి పట్టణ ప్రాంతాల నుంచి కాగజ్‌నగర్ మీదుగా మహారాష్ట్రకు ఆటోలో తరలిస్తున్న 3.50 క్వింటాళ్ల బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేసి డ్రైవర్ సురేశ్‌పై కేసు నమోదు చేసి పట్టుకున్న బియ్యంతో పాటు ఆటోను కాగజ్‌నగర్ రూరల్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.



మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



డోలాతో వస్తున్న మహిళలు



అమ్మ దర్శనానికి వెళ్తూ..

నాగోబా దర్శనానికి అమ్మ

- నేటితో ముగియనున్న జంగుబాయి ఉత్సవాలు
- మొక్కులు తీర్చుకున్న 356 మేళాలు
- నెలరోజుల పాటు కొనసాగిన జాతర
- తెలంగాణ నుంచే అధిక భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల ఆరాధ్యదైవంగా భావించే జంగుబాయి ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్‌లో శనివారం నుంచి ప్రారంభం కానున్న నాగోబా పూజ నేపథ్యంలో నేటి రాత్రి జంగుబాయి కేస్లాపూర్‌కు చేరుకుంటుందని భక్తుల నమ్మకం. శుక్రవారం ఉత్సవాలు ముగింపు కావడంతో గురువారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 356 మేళాలు జంగుబాయిని దర్శించుకున్నాయి. 2లక్షలా 53 వేలకు పైగా భక్తులు హాజరైనట్లు కమిటీ సభ్యులు కొడప జాకు, మరప బాజీరావు తెలిపారు.

ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ..



రావిచెట్టు వద్ద పూజల్లో..



నేడు దేవతల శుద్ధీకరణ

నేడు మధ్యాహ్నం 2గంటలకు సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లోని పవిత్ర నదుల్లో నుంచి గంగాజలాన్ని తీసుకొచ్చి దేవతా విగ్రహాలను శుద్ధిచేస్తారు. శనివారం కేస్లాపూర్‌లో ప్రారంభం కానున్న నాగోబా దేవతా ఉత్సవాలకు అమ్మవారు వెళ్లనుండడంతో అదే రోజు చివరిగా కటోడాలు ఖరారు చేశారు. దేవతల శుద్ధి కార్యక్రమంతో జంగుబాయి ఉత్సవాలు ముగుస్తాయి.

జువైనల్.. జస్టిస్!

- నాలుగు జిల్లాల్లో జువైనల్ కోర్టుల ప్రారంభం
- బాల నేరాల పరిష్కారం వేగవంతం
- వారానికోసారి విచారణ



మంచిర్యాల జిల్లా జువైనల్ కోర్టు ప్రారంభించిన న్యాయమూర్తి ఉపనిషధ్వని



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జువైనల్ కోర్టు

మంచిర్యాలక్రైం: బాల నేరస్తులకు సంబంధించిన కేసుల విచారణ ఇప్పటి వరకూ ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే కొనసాగుతోంది. విచారణ వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో జువైనల్ కోర్టులు ఏర్పాటు చేశారు. దీంతో ఏ జిల్లాకు సంబంధించిన కేసులను ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఎదురుగా ఉన్న బాలసదన్ కార్యాలయంలో ఈ నెల 12న జువైనల్ కోర్టును ప్రారంభించారు. ఇన్‌చార్జి న్యాయమూర్తిగా జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషధ్వని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సహినా సుల్తానా, సూపరింటెండెంట్‌గా మహ్మద్ షఫీ కొనసాగనున్నారు.

కక్షిదారులు, న్యాయవాదులకు ఊరట...

జిల్లా కేంద్రంలో జువైనల్ కోర్టు ఏర్పాటు కావడంతో ఇటు కక్షిదారులు, అటు న్యాయవాదులకు ఊరట లభించింది. ఇదివరకు జిల్లాకు చెందిన బాల నేరస్తులకు సంబంధించిన కేసులన్నీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జువైనల్ కోర్టులో న్యాయవిచారణ జరిగేవి. మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే 150 కిలోమీటర్ల దూరం 4 నుంచి 5గంటల వరకు ప్రయాణం చేయాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో అక్కడే ఉండాల్సి రావడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. పైగా కోర్టు టైం అయిపోయే సరికి మంచిర్యాలకు వచ్చేందుకు బస్సులు లేకపోవడంతో కక్షిదారులు బస్టాండులోనే బస చేసిన సందర్భాలున్నాయి. ఎట్టకేలకూ జిల్లా కేంద్రంలో జువైనల్ కోర్టు ఏర్పాటుతో కక్షిదారులు, న్యాయవాదులకు సమయం, డబ్బులు ఆదా కానుంది. అంతేకాకుండా కేసుల విచారణ సైతం త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో బాల నేరస్తుల కేసులు

మంచిర్యాల :	70
ఆదిలాబాద్ :	74
ఆసిఫాబాద్ :	80
నిర్మల్ :	136

బాలనేరస్తుల నియంత్రణకు కృషి చేయాలి



బాల నేరస్తుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. సోషల్ మీడియా, ఇంటర్‌నెట్ సెల్‌ఫోన్లు యువతను, మైనర్లను పెడదోవ పట్టిస్తున్నాయి. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. ఎవరితో మాట్లాడుతున్నారు. వారి స్నేహితుల వివరాలను సైతం తెలుసుకోవాలి. తల్లిదండ్రులు ఎక్కువ సమయం పిల్లలతో సరదాగా గడుపుతు వారితో కాలక్షేపం చేసినప్పుడు వారి మానసిక స్థితిని, వారి ప్రవర్తనలో మార్పును గమనించాలి.

– అఖిల్ మహాజన్, ఇన్‌చార్జి డీసీపీ, మంచిర్యాల

జువైనల్ కోర్టు ఏర్పాటు అభినందనీయం



జిల్లాలు ఏర్పడిన చాల కాలం తర్వాత జిల్లా జువైనల్ కోర్టు ఏర్పాటు చేయడం అభినందనీయం. దీంతో కక్షిదారులకు చాల మేలు జరుగుతోంది. సామాన్య మానవుడు ఆదిలాబాద్ వెళ్లాలంటే వారిని కొన్ని సందర్భాల్లో న్యాయవాదులే డబ్బులిచ్చి తీసుకెళ్లాల్సి వచ్చేది. ఎంతో ప్రయసాలకు ఓర్చి వెళ్లిన కొన్ని సందర్భాల్లో 'కోర్టు సమయానికి వెళ్లకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. తిప్పలు తప్పుతాయి.

– సహినా సుల్తానా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జువైనల్ కోర్టు, మంచిర్యాల

కేసులు త్వరగా పరిష్కారం అవుతాయి



జిల్లాలో జువైనల్ కోర్టు ఏర్పాటు కావడం అభినందనీయం. దీంతో బాల నేరస్తులకు సంబంధించిన కేసులు త్వరగా పరిష్కరించబడుతాయి. జిల్లాకు మహిళా కోర్టు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో 2004 నుంచి జిల్లా కేంద్రంలో కోర్టులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 42 సర్వే నంబర్‌లో 5ఎకరాల స్థలం కేటాయించడం జరిగింది. త్వరగా నిర్మించాలి.

– రవీందర్‌రావ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మంచిర్యాల

ఎమ్మెల్యేకు నిరసన సెగ

- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన సెకండ్ ఏఎన్ఎంలు



దండేపల్లి: కొండాపూర్‌లో నల్లబ్యాడ్జీలతో విధుల్లో పాల్గొన్న సెకండ్ ఏఎన్ఎంలు.

దండేపల్లి: కంటి వెలుగు కార్యక్రమంతో అందరి జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని సెకండ్ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. దండేపల్లి మండలం కొండాపూర్‌లో గురువారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలు విధుల్లో పాల్గొన్నారు. కార్యక్రమ పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే దివాకర్ రావు ఎదుట నిరసన తెలిపారు. 15 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, తమ డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



అదనపు గదులకు భూమిపూజ చేస్తున్న మంత్రి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

లక్ష్మణచాంద(నిర్మల్): ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకే సీఎం కేసీఆర్ మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి పథకంలో భాగంగా మంజూరైన రూ.89 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలలో అదనపు గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, బెంచీలువంటి 12 రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ ముత్యంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మోహన్, నాయకులు రమేశ్, క్రిష్ణారెడ్డి, గణేశ్, ఈటెల శ్రీనివాస్, జహీరొద్దీన్, మల్లయ్య పాల్గొన్నారు.

రూ.లక్ష విలువైన గంజాయి పట్టివేత

- వివరాలు వెల్లడించిన సీఐ రఘుపతి



వివరాలను వెల్లడిస్తున్న సీఐ రఘుపతి

ఆదిలాబాద్‌రూరల్: మహారాష్ట్రలో గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా మావల, సీసీఎస్ పోలీసులు బుధవారం ఉమ్మడిగా దాడి చేసి దస్నాపూర్ సమీపంలో రూ.లక్ష విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. గురువారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలానికి చెందిన దుతిరాజ్ ప్రశాంత్ జల్సాలకు అలవాటుపడ్డాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాధించాలనే ఉద్దేశంతో గంజాయి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. తన మిత్రులతో కలిసి ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుల్లో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కు సరఫరా చేస్తున్నాడు. తనకు వరుసకు మామైనా మిలింద్ నిర్వతికి గంజాయి సరఫరాపై చెప్పాడు. ఈ నెల 14న ఇరువురు హైదరాబాద్ చేరుకొని ప్రశాంత్ తనకు ముందే పరిచయం ఉన్నా లక్ష్మణ్‌కు ఫోన్ చేశాడు. గంజాయి కావాలని తెలిపి ఇద్దరు కలిసి ఈలనె 15న భద్రాచలం చేరుకొని రాత్రి అక్కడే ఉన్నారు. లక్ష్మణ్ వీరిని సిలేరు దగ్గరకు రమ్మని చెప్పగా వారు మరుసాటి రోజు 16వ తేదీన సిలేరుకు వెళ్లారు. అతడు వీరికి గంజాయి నమూనాలు చూయించాడు. అది చూసిన ప్రశాంత్ రూ.10వేలు అడ్వాన్స్‌గా ఇచ్చి కిలోకు రూ.3వేల చొప్పున ఎనిమిది కిలోల గంజాయి కావాలని అడిగాడు. ఈ నెల 17న భద్రాచలం చేరుకుని లక్ష్మణ్ ప్రశాంత్‌కు ఫోన్ చేసి బస్టాండ్‌కు వెళ్లాలని, అక్కడ మాకు సంబంధించిన వ్యక్తి గంజాయి ప్యాకెట్లు ఇస్తాడని చెప్పారు. ప్రశాంత్, మిలింద్ ఇద్దరు బస్టాండుకు వెళ్లగా ఓ వ్యక్తి వచ్చి 8 కిలోల నాలుగు గంజాయి ప్యాకెట్లు ఇచ్చారు. దీంతో ప్రశాంత్ ఫోన్‌పే ద్వారా రూ.13వేలు పంపించాడు. 18వ తేదీన ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు దస్నాపూర్ సమీపంలో ఆటో కోసం వేచి ఉండగా పోలీసులు పట్టుకుని తనిఖీ చేసి గంజాయి, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నాం. ఈ సమావేశంలో ఎస్సై విష్ణు వర్ధన్ ఉన్నారు.

కాజిపల్లిలో పందెం ఎద్దు మృతి

- ఘనంగా దహన సంస్కారాలు



మృతి చెందిన ఎద్దు వద్ద రైతు రాజన్న

భీమారం: మండంంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన రాజన్న అనే రైతుకు చెందిన పందెం ఎద్దు గురువారం మృతి చెందింది. దీనితో గ్రామంలోని రైతులే కాకుండా పలు ప్రాంతాలకు చెందిన వారు వెళ్లి మృతి చెందిన ఎద్దుని చూసి రైతును ఓదార్చారు. రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన ఎద్దు పందెంలో దిట్టగా మారిందని గ్రామస్తులు తెలిపారు. మంచిర్యాల జిల్లాలోనే కాకుండా ఉమ్మడి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో జరిగిన ఎద్దు పందేళ్ల పాల్గొని అనేక బహుమతులు సాధించిందని వారు తెలిపారు. రెండురోజుల క్రితం పెద్దపల్లి ప్రాంతంలోని నందగిరి గ్రామంలో జరిగిన ఎద్దుల పందెంలో పాల్గొనేందుకు వెళ్లగా కొంత అస్వస్థతకు గురి కావడంతో పందెం నుంచి తప్పించి ఇంటికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి అస్వస్థతకు గురై గురువారం మృత్యువాత పడింది. ఇటీవలే రూ.3.50 లక్షలకు కొనుగోలు చేస్తామని పలువురు అడిగినా సదరు రైతు దానిని విక్రయించలేదు. ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దహన సంస్కారాలు చేశారు.

వివాహిత ఆత్మహత్య



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

తిర్యాణి: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దేవాయిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని చందుగూడలో గురువారం వెలుగుచూసింది. ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం... తానుబాయి (36) భర్త లక్ష్మణ్ ప్రతిరోజు తాగి వచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. తాగుడు మానేయాలని ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందింది. మృతురాలికి కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో, బైక్ ఢీ - నలుగురికి గాయాలు

బెజ్జూర్: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొనగా నలుగురికి గాయాలైన ఘటన గురువారం మండలంలోని గొల్లబాయ్ చెరువు సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న గొతురే పోచన్న, ఆటోలో వెళ్తున్న బెజ్జూర్ మండలానికి చెందిన లక్ష్మి, స్వప్న, సారక్కలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

వసతి గృహంలో కంప్యూటర్ చోరీ



పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మణ్

లక్సెట్టిపేట: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో కంప్యూటర్ చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం.. ఐదు రోజులుగా విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు రావడంతో హాస్టల్ మూసి ఉంచారు. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి వసతి గృహంలోని కంప్యూటర్ ఎత్తుకెళ్లారు. సిబ్బంది గురువారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చోరీకి గురైన కంప్యూటర్ విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.